# 41. భయం ! భయం!

**చా**లా ఇంట్రస్టింగ్‌గా ఉంది. నేను చదువుతున్న టాపిక్. భయాన్ని ఎనలైజ్ చెయ్యడానికి ప్రయత్నించాడు రచయిత. మనుషులు దేన్నిచూసి భయపడతారు? పెనుభూతాల్లాంటి పెళ్ళాన్నిచూశా? అనుక్షణం దహించివేసే అపోహలూ, అనుమానాలూ దృష్టిలో పెట్టుకునా? ముసలితనానికా, రోగానికా, మృత్యువుకా దేనికి మనిషి భయపడేది? ఒంటరితనమా, దారిద్ర్యమా ఎదురుచూడని దురదృష్టమా? దేన్నుండి దూరంగా పారిపోదామని మనిషి ప్రతినిత్యం కోరుకొనేది? క్రూరమృగమా. మిత్రద్రోహమా, చీకటి ప్రదేశమా, తప్పుచేశానని అంతరాత్మ దహించడమా, ఏది అన్నిటికన్న ఎక్కువగా మనిషిని భయపెట్టేది? చదువుతున్న పుస్తకాన్ని అలా గుండెల మీద పెట్టుకుని కళ్ళు మూసుకుని ఆలోచిస్తూంటే చిన్ననాటి సంఘటన ఒకటి నా కళ్ళముందు ప్రత్యక్షమయింది, అందరూ అన్ని దిక్కులుగా పారిపోతే అంత పెద్ద వర్షంలో, మరింత పెద్ద వర్షం కింద ఆనాడు, ఆనాడు నాకెంత భయంవేసిందని! ఇంతకీ ఆ 'పెద్ద వర్షం' పేరు?

★

తలుపు ఎవరో కొడుతున్నారు.

కొట్టడం కాదు, చితక్కొట్టేస్తున్నారు!

'నాన్నగారు నిద్రపోతున్నారని చెబితే మీక్కాదూ? ఇంకొ గంటపోయాక రండి' అన్నాడు రవి.

'గంట కాదు. అర నిముషంకూడా ఆగను. వెంకట్రామయ్య వచ్చాడని చెప్పి వెంటనే లేపు.'

'అది కాదండీ........' అని వాడింకా ఏదో చెప్పబోతూఉంటే నేను కళ్ళతో వారించి గుమ్మం దగ్గర కెళ్ళి నెమ్మదిగా తలుపుతీసి చూడబోయాడు ఆయన.

'అత్తమ్మా మావయ్య పడుకున్నారండి..... శలవునాడు ఏడుగంటల ముందు లేపడానికి మాకు రూల్సు లేవు....... అంచేత.....' అనబోతూంటే ఆ వచ్చిన మనిషి నామాట పూర్తి కానివ్వలేదు ఒక్క ఉదుటున లోపలికి వచ్చాడు. ఎదురు చూడని ఆ ఊపుకి నేను వెనక్కిపడ్డాను.

"చూడబ్బాయ్ నీ వయస్సెంతా!'

'పన్నెండు' అన్నాను కూడతీసుకుని కూచుంటూ.

'నా వయసెంతో ఎరుగుదువా?'

అప్పుడు చూశాను ఆయన్ని ఎగాదిగా. ఏ ఎనభై అయిదో ఉండి ఉండాలి. అంత ముసిలివాణ్ణి అంతకుముందు చూళ్లేదు నేను.

'ఏం మాట్లాడవేం? ఏ నలభైఅయిదో అనుకుంటున్నావు కదూ? అవును ఎలా కనిపిస్తే అలా అనుకుంటారు మీ తప్పేముంది మొన్న శ్రీ రామ నవమికి అర్వై వెళ్ళేయి నాకు. అంటే నీవయస్సుకి

ఎన్ని రెట్లన్న మాట? నువ్వు చెప్పు పాపా!'

చదువుతున్న తెలుగు వాచకం వెనకనుంచి ఇంత సేపట్నుంచి వచ్చిన ఆయన్ని ఆశ్చర్యంగా పరికిస్తున్న పాప అప్రయత్నంగా 'అయిదు' అంది.

'అవునా? ఇంత పెద్ద వాణ్ణయినా నేనిలా తోసే సరికి అంత కుర్రాడూ వెల్లికిలా పడ్డాడు ఎవరి కెక్కువ బలం ఉందంటారు?'

'మీకే' అన్నాడు రవి.

'ఇంత బలం ఎలా వచ్చిందంటారు? ఇంత వర్షాకాలంలోనూ నేను ఎన్నింటికి లేచానంటారు? నాలుగూ, ఏ నీళ్ళు పోసుకున్నాననుకుంటున్నారు? వేణ్ణీళ్లు కదూ? పొరపాటు నూతినీళ్లు, నెత్తిమీంచి! ఈనాటికి ఎంతదూరం తిరిగి వచ్చానంటారు నేను? పదిమైళ్ళు! ఎలా? రిక్షా మీదా? చస్తే అలాంటి తెలివి తక్కువ పని చెయ్యను. భగవంతుడిచ్చిన కాళ్లు ఉపయోగించి. ఈనాడింత ఆరోగ్యంగా హాయిగా కబుర్లు చెప్పగలుగుతున్నానంటే ప్రతిరోజూ నేను తెల్లారి నాలుగు కొట్టేసరికల్లా లేచిపోడమే కదూ కారణం!అలాంటిది ఏడుంపావు దాటిపోయింది. ఇంకా ఆ గదిలో ముసుగెట్టుకుని గుర్రు పెడుతున్నాడా చిదంబరం! పోనీ వాడికి సిగ్గులేకపోతే పోయింది, చీకటితోనే లేచి యింట్లో పనీ పాటూ చేసుకోవలసిన ఆడకూతురు, ఆ యిల్లాలుకేనా యింత బుద్ధీ, జ్ఞానం, మంచీ మర్యాదా లేవూ?' అంటూనే ఉన్నాడు. కోపంతో ఎదురు చెప్పలేని నిస్సహాయంతో నా పెదవులు వణికేయి. శలవుల్లో అయినా మావూరు వెళ్లాలనివుండదు అంత ఇది మావయ్య అంటే నాకు. అయినా వాళ్ళ తరపున వాదించవలసిన అవసరం నాకేమీ లేదు. వాళ్ళెప్పుడూ అనవసరంగా ఒకరిచేత మాటపడి ఊరుకునే రకంకాదు. గొణుక్కుని గది తలుపు గడియతీస్తున్న చప్పుడయింది. నాకు తెలుసు. ఇవాళ పెద్ద అల్లరే అయిపోతుంది!

'ఏం నాయనా తెల్లారిందా?'

'క్షమించాలి మేష్టారూ, రాత్రి సెకండ్‌షో సినిమాకి వెళ్ళేం మరీ పెద్దషో......... వచ్చేటప్పుడు ఓ పట్టాన రిక్షా దొరకలేదు..... ఇల్లు చేరేసరికి మూడుగంటలయిపోయింది. ఒక్క పది నిమిషాల్లో వచ్చేస్తాను........ చూడు తులసీ..... నేను చిన్నప్పుడు చదువుకున్నాని చెప్పేనే ఇదిగో యీ వెంకట్రామయ్య మేష్టార్. నేను ఈనాడు యీ మాత్రంగా ఉన్నానంటే వీరు నాకు ఆనాడు పెట్టిన విద్యా భిక్షే కారణం.'

అత్తయ్య నమస్కారం చేసి కాఫీ తెస్తానని లోపలికి వెళ్ళింది. నా ఆశ్చర్యాని కంతులేకపోయింది. మావయ్యకూడా అబద్దాలు ఆడతాడని అదే మొదటిసారి నాకు తెలియడం.....

'ఏమిటీ పాపా చదువుతున్నావ్ ఇలా యియ్యి.'

సుధ కొత్తగా బెదురుగా చూస్తూ ఆ పుస్తకం ఆయన చేతిలో పెట్టింది.

'ఏదీ అప్పచెప్పు........ శ్రీరాముని దయచేతను.......'

ఆ పద్యం సుధకి బాగా వొచ్చు...... నాకు తెలుసు... కాని ఆయన ముందు ఒక్క

చరణమయినా తప్పులులేకుండా చదవలేకపోయింది.

'ఓసి వెర్రిపిల్లా ఒక్కటంటే ఒక్క పద్యం సరిగా చదవలేకపోయావ్, ఎందుకు పనికొస్తావ్ నువ్వా? శతకమంటే ఎన్ని పద్యాలుంటాయ్ ఏమోయ్ నువ్వు చెప్పు.....'

'నూరు కాబోలు'.... అన్నాను.

'కాబోలు ఏమిటి నీ మొహం ఇలాంటి సణుగుడు వ్యవహారం నాదగ్గిర పనిచెయ్యదు జీవితంలో స్పష్టత ఉండాలి. ఏమిటి చెబుతున్నానూ? శతకాల మాట కదూ? అలాంటి శతకాలు కనీసం ఏభై ఉంటాయి. అంటే మొత్తం ఎన్ని పద్యాలుంటాయన్నమాట ఏభై ఇంటూ నూరు అంటే ఎంత? అయిదువేలు. నీకంటె ఇంకోగుప్పెడు ఉండేవాణ్ణో లేదో అప్పటికే అయిదువేల పద్యాలూ నా నోటికి కంఠోపాఠంగా వచ్చేశాయ్?'

'అమ్మ నాయనోయ్.'

'మరేమిటి చదువంటే మజాకా అనుకున్నావా. తెల్లారే సరికల్లా ఇంత పౌడరు రాసుకుని ఎలక తోకలాంటి రెండుజడలూ వెనక్కి విరిచి కట్టి మూడుముస్తాబులూ అయి కూచుంటే దానిమటుకదే వచ్చి సరస్వతి ఒళ్లో వాలుతుందనుకున్నావా!'

రవీ, సుధా ఏమనుకున్నారో నాకు తెలీదు గాని ముసలాయన ధోరణి నాకేమాత్రం హితవుగా లేదు. ఇంట్లో అందర్లోకి చిన్న పిల్ల అయినా ఎవరి పన్లు వాళ్ళు చేసుకోవాలి అనే మావయ్య రూలు అందరికన్న ముందు అమలులో పెట్టేది అదే. చిన్న చిన్న చినుకులు పడుతున్నా ఆరింటికి లేచి పోయింది. అమ్మ సాయంలేకుండా అన్ని పనులూ అరగంట్లో పూర్తిచేసుకుని శలవురోజయినా బుద్ధిగా కూచుని చదువుకుంటోంది. దాన్తో మాట్లాడవలసిన తీరిదేనా? అదే క్షణంలో 'కాఫీ తీసుకొండి' అంటూ అత్తయ్య నా ఊహల్ని చెదరగొట్టింది. "చూడు చిదంబరం నాగురించి ఈమెకేం చెప్పినట్టు లేదు. మీ అందరితోపాటు నేనూ కాఫీ అనబడే నాగరికతా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాననుకుంటున్నారు కాబోలు.'

'క్షమించండి మీరు కాఫీ తాగరని నాకు తెలీదు పోనీ బోర్నవిటా, హార్లిక్సు'

'ఉహూ!'

'అయ్యో రాకరాక వచ్చారు ఏదీ పుచ్చుకోకపోతే ఎలా? పోనీ ఇంత కమ్మని మజ్జిగ లేదా నిమ్మరసం......?'

'అయ్యో రామా ఇంకా పెరటిదారినే ఉన్నావేం అమ్మాయీ నువ్వా ఈనాడయితే ఇన్ని రకాలు వచ్చాయిగాని మా రోజుల్లో యిలాంటి ఖర్చులు ఎరుగుదుమా? మా శరీరాలు యీనాడు యింత దృఢంగా ఉన్నాయంటే ఆనాడు మా పెద్దలు మాకు తినిపించిన తరవాణి మెతుకులే కదా కారణం! ఏమీ వద్దు నువ్విలా వచ్చి నాదగ్గర కాసేపు కూచో. అంతే చాలు. పది గంటలకల్లా ఇంటికెళ్లి భోజనం చేసేస్తాను నేను ఈ లోపల పచ్చి మంచి నీళ్ళయినా ముట్టుకోను ఏదో ఈ జీవుణ్ణి యిలా

వెళ్ళిపోనీ!'

ఆయన పట్టుదల ముందే ఎరుగును కాబోలు మా మావయ్య మరేం బలవంత చెయ్యక ఆయన దగ్గరగా వచ్చి కూచుని,

'పిల్లలూ మీరు లోపలికిపోయి ఆడుకోండి 'అన్నాడోలేదో' అక్కర్లేదు వాళ్ళని ఉండనియ్యి వయస్సు వచ్చినా చిన్న పిల్లల మనస్సే నాది. నాదగ్గిర ఒకటి లోపలా ఒకటి పైనా అని ఉండదు. అదిగాక కృత్రిమమైన నేటి సాంఘిక వ్యవస్థలో నాలుగు మంచిముక్కలు చెవినపడే అవకాశం మాత్రం వాళ్ళకి మళ్ళీ మళ్ళీ వస్తుందా?'

రవీ, సుధా బిక్కచచ్చిపోయి అక్కడే ఉండిపోయాడు. నేను మాత్రం ఇక భరించలేక 'పిలిచావా అత్తయ్యా!' అని వంక పెట్టి పెరట్లోకి వెళ్లిపోయాను. ఎంత ఆశ్చర్యం, వర్షం కొట్టి కురుస్తోంది!

అందులో ఆశ్చర్యపడవలసిన విషయం వర్షం కురవడంకాదు. అంతసేపూ అది నేను గమనించకపోవడం! అంతకన్నా ఆశ్చర్యం కలిగించే విషయం అంత వర్షపు చప్పుడులోనూ వెంకట్రామయ్యగారి వాగ్ధాటి చప్పుడు ఇంట్లో ఏమూల దాక్కున్నా స్పష్టంగా వినిపించడం!

'ఇన్నాళ్ళకి ఈ శిష్యుడిమీద దయకలిగి వచ్చారు సార్. ఏ వారం రోజులో మా యింట్లో ఉండిపోనిదే వెళ్ళనియ్యను' మిమ్మల్ని అంటున్న మావయ్య మాటలు వింటూంటే మొట్ట మొదటి సారిగా మా యింటివైపు దృష్టిమళ్లింది నాకు. అయితే వెంకట్రాయ్యగారి జవాబు మాత్రం నా దృష్టిని మళ్ళీ ఇటువైపు మళ్ళించింది.

'వారంరోజులా? నాకు తీరిక ఉండొద్దూ? ఈ పూట యిక్కడ భోంచేస్తే వారంరోజులున్నంత ఫలం! ఏదో పలకరిద్దామని వచ్చానంతే'

'అదేమిటి, ఇన్నాళ్ళకి కనపడి ఒక్కపూటయినా భోంచెయ్యరూ మా యింట్లోకి రావడం, వెళ్లడం అంతా మీ యిష్టమే అనుకున్నారా ఏమిటి, అదేం కుదరదు' ఆయన నవ్వి అన్నారు.

'ఒరే బాబూ చిదంబరం..... ఇన్నాళ్లదాకా నన్ను కట్టిపడేసే వాళ్లెవరూ లేకపోయారు. ఒకరి మాట వినడమనేది లేకుండా ఏదో యిన్నాళ్ళూ యీ జాతకం నడిచింది. యికముందూ నన్నిలా స్వేచ్ఛగా వెళ్లిపోనీ. చిన్న మాట తేడా వచ్చిందని అప్పటికప్పుడు చేస్తూ చేస్తూన్న ఆ పనికి రిజైను చేసి, యిచ్చినవాణ్ణి వద్దన్న పనిచేసిందని భార్యా బిడ్డల్ని పుట్టింటికి దిగబెట్టి మరి జన్మలో అటువైపు చూడకుండా మసులుతున్నాను. నాకా, నువ్వు యీనాడు సంకెళ్ళువేసి కూచోపెడదామని ప్రయత్నించేదీ? ఇక్కడున్నావని తెలిసి అభిమానం చంపుకోలేక ఓసారి చూసిపోదామని వచ్చానుగాని అన్నహారాలు కోరి వచ్చాననుకున్నావురా? ఏదో చూశాను. అంతా బాగున్నారు. అంతే చాలు వర్షం తగ్గినట్టుంది వెడతా.'

'వెదురుగాని కూచోండి మేష్టారూ వర్షం కొంచెం తగ్గింది కాని యింకా ఎక్కడ మబ్బులు అక్కడే ఉన్నాయి. అంతలో పెద్దదైనా అయిపోవచ్చు' "ఓరి, ఇదొక వర్షమట్రా దీన్ని తలదన్నిన తుఫానుల్ని

చూశాను. ఇందుకని పని పాడుచేసుకుంటామా? తొమ్మిదింటికి రీడింగ్‌రూంలో 'మాటలు జాగ్రత్తగా ఖర్చు పెట్టు' అనే విషయం పై గంటల కొద్దీ ఉపన్యసించాలి. వెళ్లొస్తామరి" చిన్నచిన్న చినుకులు పడుతూనే ఉన్నాయి. మా యింటికి ఆ రీడింగ్ రూం మైలు పైగా దూరం ఉంటుంది. మా యింట్లో ఉన్న ఒక్క గొడగూ మామయ్య ఫ్రెండ్ పట్టుకెళ్ళేడు. రిక్షాలో వెళ్ళమని ఆయన్ని ఎలాగో అలా చచ్చీ చెడీ ఒప్పించినా పావుగంట ఎదురుచూసినా ఆపైపు ఖాళీరిక్షా రాలేదు. ఆఖరికి ఆయన బాధ్యత మావయ్య నా కప్పగించాడు. ఆయన్ని బస్స్టాండుదాకా తీసికెళ్ళి అక్కడెలాగా రిక్షాలు దొరుకుతాయి గనక, రిక్షా కుదిర్చి పెట్టి సాగనంపి ఇంటికి రావాలి.

మేమిద్దరమూ ఇలా ఫర్లాంగూ ఫర్లాంగున్నర నడిచామో లేదో ఉన్నట్టుండి ఇంతలేసి అంతలేసి చినుకులు పడడం ప్రారంభించాయి. పరిగెత్తి తలదాచుకుందామన్నా ఆ చుట్టుప్రక్కల ఇళ్లేమీ కనపడలేదు. కూడా ముసిలాయన ఒకడూ..... దూరంగా చింతచెట్టు కింద పడిపోతున్న తాటాకుల షెడ్డులాంటిదొకటి కనిపించి ప్రాణం లేచొచ్చింది. నిజానికి అప్పటికే ఆ కాస్త జాగాలో పదిమందిలా తలదాచుకున్నారు. మరొకరికయితే జాగా యివ్వకపోదురేమో.... చూడగానే ముసలి వాడూ, పండితుడూ అనిపించడంచేత కాబోలు ఒదిగి ఒదిగి జాగా యిచ్చారు. అల్లుడి స్నేహితుడి తమ్ముడిలా నాకూ తల తడిసి ముద్దయిపోకుండా కొంచెం పొడిజాగా దొరికింది.'

పైమీద గావంచాతో చెంపల్నీ కళ్ళనీ తుడుచుకుంటూ వెంకట్రామయ్యగారు చుట్టూ ఓసారి చూశారు. ఆ కొద్దిమందిలో ఆడా మొగా చిన్నా పెద్దా ఉన్నారు. వివిధ మతాలవారూ, వివిధ వర్గాలవారూ రకాని కొక్కరు చొప్పున కనిపించారు. ఆయన కళ్ళు మిలమిల మెరిశాయి. వీళ్లందరూ నావాళ్ళు అనే విశ్వజనీనభావం ఆయనలో విద్యుత్తులా వ్యాపించింది. 'వీళ్ళని బాగుచెయ్యడం నా విధి...... వీళ్ళకి తెలియచెప్పడం నా కర్తవ్యం' అనుకుని ఉండాలి ఆయన. తనని విస్మయగౌరవాలతో నఖశిఖపర్యంతం పరీక్షించే సన్నిహితులయిన అందరు శ్రోతలికి ఆశాభంగం కలిగించడం ఆయనకి ఎంత మాత్రం యిష్టంలేకపోయి ఉండాలి. ఆ తరవాత చేసే ఆయన నాలిక నాట్యానికి ఇక అడ్డూ ఆపూ లేకుండాపోయింది అసలైన వాగ్వర్షం ఎలా ఉంటుందో అప్పుడే చూశాను:

'ఎందుకే అమ్మాయీ రూపాయినోటు మడత పెట్టి కొంగున కట్టుకుంటున్నావ్, తడిసిపోతుందనే? అలా అయితే ఆ రోజుల్లో వేలకివేల రూపాయలు ఒక్కదమ్మిడీ తేడా రాకుండా అందరికీ నేనెలా పంచగలిగేవాణ్ణి! ఎప్పటి మాట ఇది! అప్పటికి మీలో చాలామంది పుట్టేరో లేదో.... ఆ జిల్లాకంతటికీ పెద్ద స్కూలు మాది అందులో పనిచేసేవాణ్ణి. టీచర్లమే ఉండే వాళ్ళం ఓ ఏభై మందిమి. ఆ ఏభై మందిలోనూ నేనే పెద్ద. ఎంతెంత లెక్కలేనా ఎడం చేత్తో చేసి పారేసేవాణ్ణని డబ్బు వ్యవహారం అంతా నాకే వదిలిపెట్టేవారు హెడ్మాష్టరు.... ఇరవై ఏళ్లు పనిచేశాను అక్కడ. అంటే ఎన్ని నెలలు? ఇరవై ఇంటూ పన్నెండు. రెండొందల నలభై నెలలు, పేరుకి రైటరు ఒకరుండే వాడు గాని ఇన్ని నెలలూ జీతాలు పంచిపెట్టింది నేనే.... ఎక్కడైనా ఒక్క పైసా అటూ ఇటూ వచ్చిందీ! ఎందుకొస్తుందీ చేస్తున్న

పని దైవ స్వరూపంగా మనిషి భావించగలిగితే? ఇప్పుడూ ఉన్నాయి ఆఫీసులూ..... అందులో పనిచేసే అల్పజీవులూ చెప్పక చెప్పక వీళ్ళ గురించే చెప్పాలి..... టైం వేస్టు.'

'ఏమిటబ్బాయి, ఆ ఇంగ్లీషు పేపరూ? పెద్ద ముండావాణ్ణి. నేనడుగుతున్నానని బాధపడక ఒక్క ముక్క చెప్పు. అది నిజంగా చదువుదామనే పట్టుకున్నావా, లేక షోకు తక్కువయిందా? మళ్ళీ ఎమ్మే ప్యాసయానంటున్నావ్. ఒక్క అప్లికేషను ఫారమ్ తప్పు లేకుండా నింపగలవూ? నీమాట దేవుడెరుగు, నీకు చెప్పిన మేష్టరికి డొక్క శుద్ధి ఉందిటయ్యా అసలూ?'

'ఇలా దగ్గరగా రా నాయుడూ ఏ ఊరుమనది? ఒళ్లొంచి పనిచేసేవాడివికదా నీక్కూడా ఆ టెరిలిన్ చొక్కా తొడుక్కోవాలనే దుర్బుద్ధి ఏమిటి? ఏం అట్టేకాలం బతకాలని లేదా ఏమిటి? అలాంటి బట్టలు వేసుకుంటే వాయుప్రసారం సరిగా ఉండదు తెలుసా? ఏమిటి ఆ చొక్కా ఖరీదు యాభై రూపాయలా! మా కాలంలో అయితే ఆ యాభైరూపాయలకే యింటిల్లిపాదికీ సమృద్ధిగా బట్టలు వచ్చేవి! ఏం దరిద్రగొట్టు కాలం వచ్చిపడింది!'

'కాలం విలువ ఎంతగా తెలియకుండా పోతోంద్రా యీ కలికాలపు పిల్లలకీ, సినిమాలకీ, షోకులకీ ఎక్కడలేని డబ్బూ, టైమూ చాలడం లేదు. అద్దైనా ఎంతసేపూ నాకాయుష్యం నా కారోగ్యం ఇంతే. నూతుల్లో కప్పల్లాగ ఇంతే బతుకు. మన గురించి ఎవడు బాగా టముకు వెయ్యగలిగితే వాడే మన ఆప్తుడు. అదీ కుదరకపోతే మన డప్పు మనం వాయించుకోడమే. అంతేగాని మన పక్కవాడు ఏమైపోయాడో మనకక్కర్లేదు ఎంతసేపూ మనధోరణి మనదేగాని ఎదుటివాడు ఆసక్తితో వింటున్నాడా లేదా అనే విచక్షణకూడా పోయింది ఈ కాలపు వాళ్ళకి.'

'మా కాలంలో మంచి ఆదర్శాలుండేవి పెద్దలంటే భయం, భక్తీ ఉండేవి. ఆ ప్రకారం నడుచుకునే వాళ్ళం మేము అందుకే మా జీవితాలు బొత్తిగా నిరర్థకమైపోయాయని మేం విచారించవలసిన పనిలేకుండా గడిచాయి నియమం ఉండి, ఉదారమైన త్యాగబుద్ధిగల నాయకులుండేవాడు అప్పుడు. మనిషికి కావలసిన కూడూ, గుడ్డా, తిండీ సమృద్ధిగా లభించేది. ఇప్పుడో, ఎంత సంపాదించుకున్నవాడికైనా నాలుగువేళ్ళూ లోపలికి వెళ్ళేసరికి గుడ్లు పైకి వస్తున్నాయి. రాజకీయ నాయకుల ధర్మమా అని దేశంబతుకు బజార్నపడింది. అప్పుడే కళ్ళు తెరచిన పాపాయి అయినా సినిమా పాటల నీచార్థాన్ని విడదీసి చెబితే ఆనందించగలదు. అప్పుడే అక్షరాలు నేర్చిన అబ్బాయి అయినా 'పురుషుల్లారా! మీ సంతానాన్ని నిరోధించే శక్తి మీ చేతుల్లోనే ఉంది' అని కూడబలుక్కుని చదివి త్రికోణార్థం వివరించగలడు. ఇక సామాన్యుడి జీవితం కనీసావసరాలు సమకూర్చుకోడానికే సరిపోవడంలేదు.... ఇక గంభీరమైన రాజకీయ ఉపన్యాసాలు వినే తీరిక ఎక్కడిది? చెప్పేవాళ్ళకి ఆ కనీస జ్ఞానం ఉండాలంటారా, అక్కర్లేదంటారా?'

'ప్రపంచంలో ఇన్ని రకాల పువ్వులుండగా ప్లాస్టిక్ పువ్వుల్ని మాత్రమే ధరించిన ఓ అమ్మడూ.....'

ఇంకా అలా అలా ఎడతెరిపిలేకుండా, క్షణ క్షణం పెరిగి పోతున్న ఉత్సాహంతో

వెంకట్రామయ్యగారు ఆ నానాజాతిసమితిలోకి చెప్పిన 'నాలుగంటే నాలుగు ముక్కలు' ఎంత కాలం సాగునో తెలీదు. ఉన్నట్టుండి వాళ్ళని ఏ భయోత్పాతం క్రుంగదీసిందో తెలీదు. నిమిష నిమిషానికి ఎక్కువై వరదలు కట్టి పారే వర్షపు నీరు గాని, చెవులు చిల్లులు పడే ఉరుములుగాని కళ్ల చీకట్లు కమ్మించే మెరుపులు గాని వాళ్ళని భయపెట్టినట్టు లేదు. చెప్పలేని భయంతో, ఒళ్ల తెలియని వేగంతో....... భీభత్సమైన ప్రకృతి బడిలోనే తలదాల్చుకుని సేద తీర్చుకుందామని పరిగెత్తేరు, నలుగురూ నాలుగుదిక్కులా. వాళ్లతోపాటే నేనూ!

వాగ్వర్షమా, ఏభయమైనా నీతో సమానమా!

★